



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక 265 | సోమవారం 16 జూన్ 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



## ప్రభుత్వ పాఠశాలల్లో..

# అత్యాధునిక ఎడ్‌టెక్ బోధన



### ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ఒప్పందం

### విద్యార్థులకు సాంకేతిక బోధనా సేవలను అందించడమే లక్ష్యం

### రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం

**హైదరాబాద్, జూన్15 (క్విక్ టుడే న్యూస్):**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 6 ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలు అందనున్నాయి. ఆ మేరకు వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలతో రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రోహిణి నందన్ నీలేకని నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్ దార్ నిర్వహిస్తున్న పైజమ్ పౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యా శాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ప్రమాణాలు పెంచాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఆయా సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. దేశంలో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో ఎడ్‌టెక్ సదుపాయాలు కల్పించడం వల్ల రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంది. కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో ఎక్‌స్టెప్ ఫౌండేషన్ 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీషు భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు ఫిజిక్స్ వాలా సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది. రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల పాఠ్యాంశాలకు అనుగుణంగా ఖాన్ అకాడమీ వీడియో ఆధారిత STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పైజమ్ పౌండేషన్ కోడింగ్, కంప్యుటేషనల్ థింకింగ్‌పై శిక్షణను అందిస్తుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగుపరచం కోసం పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో పాటు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ముదిరిన వార్

### తీవ్రరూపం దాల్చిన ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం

### ఇరుదేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు

### టెహ్రాన్‌లోని షహ్రాన్ చమురు డిపో ధ్వంసం

### భారత్-పాక్‌లాగే ఒప్పందాలు కుదుర్చుకోండి : ట్రంప్

**న్యూఢిల్లీ, జూన్15:**

దాడులు, ప్రతిదాడులతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నది. ఇరు దేశాల మధ్య ఆదివారం తెల్లవారు జామున భీకర దాడులు చోటుచేసుకున్నాయి. ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంతోపాటు ఎస్‌పీఎన్‌డీ అణు ప్రాజెక్టుపై ఇజ్రాయెల్ రక్షణ దళాలు దాడులు చేశాయి. టెహ్రాన్‌లోని ప్రభుత్వ అణ్వాయుధ ప్రాజెక్టుకు సంబంధించిన లక్ష్యాలపై విస్తృతమైన దాడులను పూర్తి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. వాటిలో ఇరాన్ దాచిపెట్టిన అణు ఆర్కైవ్ ప్రదేశం కూడా ఉందని, కీలక అణు శాస్త్రవేత్తలు, అధికారులు చనిపోయినట్లు తెలిపింది. కాగా, టెహ్రాన్‌లోని షహ్రాన్ చమురు డిపోను ఐడీఎఫ్ లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. హౌసింగ్ కాంప్లెక్స్‌పై జరిపిన వైమానిక దాడుల్లో 29 మంది చిన్నారులు సహా దాదాపు 500 మంది మృతి చెందగా వేలాది మంది గాయపడ్డారు. అయితే ఇజ్రాయెల్ దాడులను ఇరాన్ సమర్థవంతంగా తిప్పికొడుతున్నది. క్షిపణులు, డ్రోన్లతో ఆ దేశంపై విరుచుకుపడుతున్నది. దీంతో జెరూసలేం, టెల్ అవీవ్‌లో అంతటా వైమానిక దాడి సైరన్లు మోగాయి. ఇజ్రాయెల్ ఇంధన మౌలిక సదుపాయాలను, ఫైటర్ జెట్ ఇంధన ఉత్పత్తికి సౌకర్యాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ సైన్యం తెలిపింది. కాగా, ఇరాన్ దాడుల్లో నలుగురు చనిపోయినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. అయితే భారత్–పాకిస్థాన్ మధ్య ఒప్పందం జరిగినట్లుగానే ఇజ్రాయెల్–ఇరాన్ దేశాలు కూడా శాంతియుత ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచించారు.